క్లుప్తంగా

డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండొద్దు



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండొద్దని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ కార్మికులను ఆదేశించారు. పట్టణంలోని పూసాల, శాస్త్రినగర్, సుగ్లాంపల్లిలో డ్రైనేజీ పనులు చేస్తున్న కార్మికులను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు డ్రైనేజీల్లో గాజుసీసాలు, ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని సూచించారు. అనంతరం పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య లేకుండా కాలనీలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా నిత్యం మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముత్యంరావు

జ్యోతినగర్: కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. నాంసాని శంకర్, భిక్షపతి, రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, భూమయ్య, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యస్థితిపై సర్వే



సర్వే చేయడానికి వచ్చిన వైద్య విద్యార్థులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో రామగుండం సింగరేణి మెడికల్ కళాశాలకు చెందిన 2022 తృతీయ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు శనివారం ఇంటింటా తిరుగుతూ ప్రజల ఆరోగ్యస్థితిపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులు ముందుగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి చేరుకోగా వారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్ సర్వేపై అవగాహన కల్పించారు. గ్రామంలోని కుటుంబాలను దత్తత తీసుకొని ప్రతీ నెల ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితి తెలుసుకుంటూ వారికి వైద్య సలహాలు ఇచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, అఖిల్, రవీందర్, నాగరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి సల్మా పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



ఉపాధ్యాయుడి దంపతులకు సన్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన సాధినేని రఘుపతిరావును ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను సన్మానించారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో మాజీ సర్పంచ్ బండారు ప్రవీణ్, తోటి ఉపాధ్యాయులు ఆయనను పూలమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలు ఖండిస్తున్నాం

రామగుండం: ఇటీవల బ్రాహ్మణపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అంతర్గాం మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నేతలు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల బకాయిలు ఇప్పించి, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి ట్రయల్ రన్ చేసి సాగునీరందించారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరందకపోయినా ఎత్తిపోతలతో రైతులకు సమృద్ధిగా సాగు నీరందించి అత్యధిక దిగుబడి సాధించిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్ది తిరుపతిగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్, జూల లింగయ్య, కొమురయ్య, సుధాకర్ ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఏటీసీ

- రామగుండం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో అందుబాటులో 172 సీట్లు



రామగుండంలో ప్రారంభానికి సిద్ధమైన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్

రామగుండం: మూస పద్ధతిలో విద్యాబోధనకు స్వస్తి పలుకుతూ ఉపాధి అవకాశాలు లభించేలా ఆధునిక విద్యాబోధనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికకైన కేంద్రాలలో ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పట్టణంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) పక్కనే రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరం ఆరంభంలో స్కిల్ ఇండియాలో భాగంగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీసీ) కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వివిధ కంపెనీలు తమ ఉత్పత్తుల్లో అనుసరించే పద్ధతులకు అనుగుణంగా ఏటీసీ కేంద్రాలలో సాధన చేయించి సదరు కంపెనీల్లో ఉపాధి కల్పించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు.

కోర్సుల వివరాలు..

పదో తరగతి అర్హతతో ఏడాది కాల పరిమితితో మూడు కోర్సులు ప్రవేశపెట్టారు. అందులో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (40 సీట్లు), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ (40 సీట్లు), ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ (20 సీట్లు), రెండేళ్ల కాల పరిమితితో బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్–మెకానికల్ (24 సీట్లు), అడ్వాన్స్ సీఎన్‌సీ మ్యాచింగ్ టెక్నీషియన్ (24 సీట్లు), మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ (24 సీట్లు) అందుబాటులో ఉన్నాయి.

రామగుండం ఏటీసీలో అందుబాటులో 172 సీట్లు..

కాగా గత 2024–25లోనే వివిధ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టగా 172 సీట్లకు 152 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వీరికి ప్రస్తుతం ఐటీఐలో విద్యాబోధన జరుగుతోంది. కాగా గతేడాది ప్రత్యేక భవనం లేకపోవడంతో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపించలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభంలోగా అధికారికంగా ప్రారంభోత్సవం చేసి నూతన భవనంలోనే విద్యాబోధన జరగనుండడంతో పదో తరగతి ఫలితాలు వెలువడిన తర్వాత ప్రవేశాల తేదీని ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



కాల్వశ్రీరాంపూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి, సన్నవడ్లకు రూ.500 బోనస్ అమలు చేస్తూ రైతుల పక్షపాతిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గంగారం, పందిల్ల, ఇప్పలపల్లె, మల్యాల, తారుపల్లి, చిన్నరాతుపల్లి, కూనారం, మంగపేట, వెన్నంపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు జగదీశ్వర్‌రావు, సారయ్యగౌడ్, రామిడి తిరుపతిరెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, గజవెల్లి పురుషోత్తం, శంకర్, శ్రీనివాస్, విజేందర్, లంక సదయ్య, గాజనవేన సదయ్య, కనుకయ్య, సతీశ్, సత్యనారాయణరెడ్డి, సదానందం, కొమురయ్య, కొట్టె సమ్మయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

సుల్తానాబాద్‌రూరల్: కందునూరిపల్లె, గట్టెపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్న య్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు పన్నాల రాములు, పన్నాల తిరుపతి, చిలుక సతీశ్, దామోదర్‌రావు, బుర్గు సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ప్రాతినిధ్య సంఘానికి వంతపాడుతున్న సింగరేణి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీకి సింగరేణి యాజమాన్యం వంత పాడుతోందని ఏఐటీయూసీ నాయకులు స్వామి, మడ్డి ఎల్లాగౌడ్ ఆరోపించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంస్థలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ ఉండగా కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌కు విరుద్ధంగా ప్రాతినిధ్య సంఘాన్ని పిలవడం సరికాదన్నారు. యాజమాన్యం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి గుర్తింపు సంఘానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ప్రాతినిధ్య సంఘానికి ఇస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ వీడియో కాన్ఫరెన్స్ బహిష్కరించినట్లు వారు పేర్కొన్నారు.

పశ్చిమబెంగాల్ సీఎంపై అనర్హత వేటు వేయాలి



ఆందోళనలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు

కోల్‌సిటీ: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై దాడులకు పాల్పడుతున్న ముస్లింలపై కఠిన చర్యలు చేపట్టాలని, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై అనర్హత వేటు వేసి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని శనివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు కోరారు. శనివారం గోదావరిఖని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల్ల సత్యంజీ, విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో హిందువులపై దాడులు చేస్తూ అల్లర్లకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి హిందూ కుటుంబాలకు భద్రత కల్పించాలని కోరారు. ఈ విషయమై రాష్ట్రపతికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీ ప్రతినిధులు మ్యాడగోని రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ సంపత్‌యాదవ్, నేరేడుకొమ్మ వెంకటస్వామి, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, మేనగోని అరవింద్, చక్రపాణి, అనిరుద్, కొండపర్తి లింగయ్య, బండ రాజేశ్ పాల్గొన్నారు.

రైతులకు భరోసా ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మంథని: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని: రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు భరోసానిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అక్కేపల్లి, మహబూబ్‌పల్లి, నగరంపల్లి, పుట్టపాక, శ్రీరాంనగర్, లక్కేపూర్ గ్రామాల్లో శనివారం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మైదుపల్లి కేంద్రాన్ని డైరెక్టర్ శ్రీనివాస్, గుమ్నూరు కేంద్రాన్ని సంఘం డైరెక్టర్ రావికంటి సతీశ్‌కుమార్, గాజులపల్లి కేంద్రాన్ని ఆర్టీఐ మెంబర్ మంథని సురేశ్ ప్రారంభించారు. సంఘం కార్యదర్శి మామిడాల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లిలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఐకేపీ ఏపీఎం పద్మ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఐకేపీ సీసీ రాధిక, వీవో ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ కార్మికుల పింఛన్ పెంపు కోసం కృషి చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలంటూ పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మికుల పెన్షన్ కోసం ఇప్పటికే ప్రతీ టన్ను బొగ్గుపై సింగరేణి సంస్థ ట్రస్ట్ బోర్డుకు రూ.10లు చెల్లిస్తుండగా, పార్లమెంటులో కొట్లాడి ప్రతీ టన్ను బొగ్గుపై మరో రూ.10 చెల్లించేలా ఎంపీ కృషి చేశారన్నారు. కామ విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లీడర్లు రాచకొండ కోటేశ్వర్లు, మల్లేశ్‌యాదవ్, తిప్పారపు మధు, కోరం నరేందర్‌రెడ్డి, జావిద్, సంపత్, మహేశ్, రాకేశ్, వినోద్, రవి, మహబూబ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో శనివారం ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు బండారి సునీల్‌గౌడ్, సజ్జద్, గంగుల సంతోష్, బాలసాని సతీశ్ క్షీరాభిషేకం చేశారు. కార్మికుల పింఛన్ కోసం రూ.140 కోట్లు విడుదల చేసేందుకు కృషిచేసిన ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కీర్తి రాజయ్య, కొండి సతీశ్, కైలాసం ఉన్నారు.

పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ నాయిని సుప్రియ శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో పార్క్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలం ఎంత ఉందనే అంశంపై ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఈవో సదయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మంథని: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవేందర్ ఆధ్వర్యంలో మంథని ఫీల్డ్ అసిస్టెంట్లు శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారి సురేశ్, తహసీల్దార్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. దేవేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 20ఏళ్లుగా ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు చాలీచాలని వేతనాలతో జీవితాలను గడుపుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ వర్తింపజేస్తూ వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలలు వేతనాలు వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గణేశ్ మద్దతు తెలిపారు. మంథని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అర్జున్, రాజమల్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రమేశ్, మొగిలి, ప్రవీణ్, దేవేందర్‌రెడ్డి, రమాదేవి, పోచయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర టెండర్ ఆదాయం రూ.2.46 లక్షలు



టెండర్ నిర్వహిస్తున్న ఈవో కాంతారెడ్డి, చైర్మన్

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర సందర్భంగా వివిధ దుకాణాల కోసం శనివారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ.2.46లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ పాలకవర్గ కమిటీ చైర్మన్ పోల్‌దాసరి సంతోష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో వివిధ రకాల దుకాణల కోసం ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి కాంతారెడ్డి, దేవాదాయశాఖ పర్యవేక్షకులు సత్యనారాయణ, చైర్మన్ సంతోష్ సమక్షంలో టెండర్ నిర్వహించారు. లడ్డు, పులహోర దుకాణంకోసం రూ.1,95,000 టెండర్ ద్వారా దక్కించుకోగా, కొబ్బరి ముక్కల కోసం రూ.31వేలు, శీతల పానీయాలు విక్రయించడానికి రూ.20వేలకు దక్కించుకున్నారు. పూజా సామగ్రి, కొబ్బరికాయలు విక్రయించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 24న టెండర్ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పేర్కొన్నారు. ధర్మకర్తల మండల సభ్యులు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలని ధర్నా



రైతులతో కలిసి ధర్నా చేస్తున్న నాయకులు

జూలపల్లి: సాగునీరు లేక పంటలు ఎండుపోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మండల మాజీ అధ్యక్షుడు విసారపు వెంకటేశం, బీజేపీ జిల్లా కార్యదర్శి అమరగాని ప్రదీప్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రైతులతో కలిసి శ్రీరాంసాగర్ నుంచి డి–83, డి–86 మెయిన్ కాలువ నుంచి మండల రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు జక్కని స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరి, మొక్కజొన్న ఎండిపోయే అవకాశం ఉందని, వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి పొలగాని సతీశ్, మేర శ్రీనివాస్, బీజేపీ నాయకులు కనుకయ్య, పెద్దోల్ల ఐలయ్య, దొడ్ల రాజయ్య, రైతులు మెండె మల్లేశం, మల్లెత్తుల మల్లేశం, బండి రాజయ్య పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మంథని: క్రైస్తవులు శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల నుంచి క్రైస్తవులు, పాస్టర్లు తరలివచ్చారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ చౌక్ మీదుగా ఆర్టీసీ బస్సు డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంసీపీఎఫ్ అధ్యక్షుడు ఐతు డేవిడ్, గౌరవ అధ్యక్షుడు ఐతు ఎలీషా, ఉపాధ్యక్షుడు కృపాకర్, కార్యదర్శి అశోక్, కోశాధికారి జయరాజ్, కమిటీ సభ్యులు నవీన్, సుదర్శన్, జోసెఫ్, రాజ్‌కుమార్, జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: నగరంలోని ప్రధాన చౌరస్తా నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ సేవాదృక్పథం పెంపొందించడమే జీసస్ బోధన అని అన్నారు.

సంక్షిప్త వార్తలు

• లయన్స్‌క్లబ్ స్ఫూర్తి అధ్యక్షుడిగా శ్రీధర్

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షుడిగా మామిడిపల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి విజేందర్ ఎన్నికయ్యారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం భవన్‌లో శనివారం జరిగిన సభ్యుల సమావేశంలో 2025–26 లియానిస్టిక్ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా సతీశ్, జోన్ చైర్మన్‌గా ప్రసాద్ ఎన్నికయ్యారు.

• సంఘీభావ సభకు తరలిరండి

పెద్దపల్లిరూరల్: ఆదివాసీహక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బహిరంగసభకు అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ కన్వీనర్ గుమ్మడి కొమురయ్య కోరారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జరిగే ఈ సభకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌తో పాటు వేణుగోపాల్, పాశం యాదగిరి, నక్క నారాయణరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మల్లి వెంకటస్వామి, విశ్వనాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు.

• ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా ప్రచార కార్యదర్శిగా రాజ్యలక్ష్మి

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లా ప్రచార కార్యదర్శిగా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తాటిపాముల రాజ్యలక్ష్మిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య తెలిపారు. శనివారం నియామక పత్రం అందజేసినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వంశీ, కమలాకర్ పేర్కొన్నారు.

• సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలి

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీ పరిసర ప్రాంత విద్యార్థులకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని శనివారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను బీజేపీ సీనియర్ నాయకులు ముల్మూరి శ్రీనివాస్ కలిసి కోరారు. సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్ ఉన్నారు.

• రాష్ట్రంలోని రాజకీయాలకు దీటుగా టీఆర్ఎస్ డీ

గోదావరిఖని: రాష్ట్రంలోని రాజకీయాలకు దీటుగా టీఆర్ఎస్ డీ పార్టీ ఉండబోతోందని వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతం కోసం మేధావులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు, నాయకులు నర్సింగ్, రమేశ్, స్వరూప, జైపాల్‌గౌడ్, రాజు, శ్రీనివాస్, బిక్షపతి పాల్గొన్నారు.

• మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి వర్ధంతి

ఎలిగేడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గీట్ల ముకుందరెడ్డి వర్ధంతి సభలో నాయకులు గుడుగుల మహేందర్, మామిడాల రమేశ్ నేత, కవ్వంపల్లి దుర్గయ్య, ముత్యల మల్లేశం, తాటిపల్లి సతీశ్‌బాబు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కూనారంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ముకుందరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. మాజీ సర్పంచులు గీట్ల నిర్మల, డొంకెన మొగిలి, విజయ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కొట్టె సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ రాజేశ్వరి, నాయకులు కుమార్, రాజయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

• 22న భూభారతి చట్టంపై అవగాహన

కమాన్‌పూర్: మండలంలోని నాగారం రైతువేదికలో 22న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వాసంతి తెలిపారు.

• రేపు జూలపల్లిలో..

జూలపల్లి: భూభారతి చట్టంపై మండలంలోని రైతులకు సోమవారం అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు.

• రేపు ఎలిగేడులో..

ఎలిగేడు: మండల కేంద్రంలోని రైతువేదికలో 21న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు.

• నేటి నుంచి బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బోడగుట్టపల్లి, కొత్తపల్లి, నక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం నుంచి శ్రీలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 24 నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కులదేవతాస్వాపన, 21వ తేదీన యాగశాల ప్రవేశం, ప్రర్యగ్నీకరణం, నవగ్రహ మంటపాలు, అగ్నిప్రతిష్ఠాపన, యంత్రజపం, 22న కలశ విశ్వాక్సేన ఆరాధన, ఆహ్వాన దేవతార్చన, యంత్రజపం, క్షీరాధివాసం, జలధివాసం, 23న ఉదయం 9గంటల నుంచి 10:30 వరకు శ్రీలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

• పాఠశాలల సందర్శన, తనిఖీ

ఎలిగేడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం, మౌలిక సదుపాయాల కల్పన తదితర వివరాల పరిశీలనలో భాగంగా శనివారం ధూళికట్టలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డైట్ ప్రతినిధి కోల శ్రీనిత(ట్రైనీ టీచర్) సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, మూత్రశాలలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

పెంచికల్‌పేటలో బడిబాట




బడిబాటలో ఎంఈవో విజయ్‌కుమార్

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో శనివారం ఎంఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించారు. బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఇస్మాయిల్, ఉపాధ్యాయులు షంషోద్దీన్, సంపత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

జ్యోతినగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచెందర్‌ను శనివారం సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో జాతీయ యువజన అవార్డు గ్రహీత, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ కలిసి ఆయనను సన్మానించారు.

నాగారంలో పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

కమాన్‌పూర్: మండలంలోని నాగారంలో శనివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ

గోదావరిఖనిటౌన్: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక జనగామ–2, 3, తారకరామనగర్–2, ఐబీకాలనీ అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం సీమంతాలు, అన్నప్రాసన, ఈసీసీఈలో భాగంగా పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. అసైన్‌మెంట్ కార్డులు అందించారు. కార్యక్రమాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి, టీచర్స్ బి.రాజ్యలక్ష్మి, కె.అరుణ, బి.మంజుల, బి.సరోజ పాల్గొన్నారు.